

కామరాజర్‌సాలైలో వర్షంలోనే వెళుతున్న వాహనాలు

వర్షం.. కాస్త ఉపశమనం

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం బలపడి తీరం వైపు పయనిస్తూ క్రమంగా మరింతగా బలపడింది. ఇది దక్షిణ ఆంధ్రా కోస్తాతీరం వైపు తీరం దాటే అవకాశాలుండటంతో రాష్ట్రానికి జారీ చేసి ఆరెంజ్ అలర్ట్ సహా భారీ వర్షసూచన హెచ్చరికలను ఉపసంహరించుకుంటున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న 24 గంటల్లోగా అల్పపీడన ప్రభావంతో చెన్నై పరిసర జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.

రాజధాని నగరానికి ఉపశమనం..

స్థానిక చేపాక్, ఎగ్మూరు, అడయార్, రాయపేట, మైలాపూరు, రాయపురం, వాషర్‌మెన్ పేట, తాంబరం, ఆవడి, తిరుముల్లైవాయల్, అన్నానగర్, పెరంబూరు, వ్యాసార్పాడి, కోయంబేడు, వడపళని, కోడంబాక్కం, నుంగంబాక్కం, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో గురువారం వేకువజాము నుండి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీంతో విద్యార్థులకు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుండే నగరమంతటా దట్టమైన మేఘాలు అలముకున్నాయి. ఇదే విధంగా చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లో గురువారం వేకువజాము నుండి మధ్యాహ్నం వరకూ ఓ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. నగరంలో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు నుంగంబాక్కంలో 4.6 సెంమీల వర్షపాతం నమోదైంది. ఎన్నూరు హార్బర్ వద్ద 4.5 సెం.మీ, నందనంలో 3.7 సెంమీ, గిండి అన్నా విశ్వవిద్యాలయంలో 3.2 సెం.మీ, మీనంబాక్కం వద్ద 3 సెం.మీ వర్షపాత నమోదయినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే మధ్యాహ్నం నుంచి వర్షం కాస్త ఉపశమించడంతో నగర ప్రజలు ఊరట చెందారు.

ప్రజల వద్దకే వైద్యం

- 2 కోట్లకు పెరిగిన లబ్ధిదారులు
- ఈరోడ్‌లో మెడికల్ కిట్లు పంపిణీ చేసిన సీఎం



ఈరోడ్ నంజనాపురంలో సుందరమ్మాళ్‌కు మెడికల్ కిట్ అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజల వద్దకే వైద్యం' పథకం లబ్ధిదారుల సంఖ్య గురువారం 2 కోట్లకు పెరిగింది. ప్రభుత్వ పథకాల అమలుతీరు పరిశీలించేందుకు గురువారం ఈరోడ్ చేరుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ నంజనాపురంలో నివసిస్తున్న సుందరమ్మాళ్‌కు మెడికల్ కిట్ అందజేయడంతో ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య 2 కోట్లకు చేరిందని స్టాలిన్ ప్రకటించారు. అంతకు ముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్ళిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఈరోడ్ నగర శివార్లలో మంత్రులు, డీఎంకే స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ స్వాగతం పలికారు. విజయమంగళం టోల్‌గేట్ వద్ద రహదారికి ఇరువైపులా గుమికూడిన వేలాదిమందిని చూసిన సీఎం... కాన్వాయ్ ఆపి వారి వద్దకెళ్లి పలుకరించారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు సక్రమంగా అందుతున్నాయా? అని అడుగుతూ వివరాలను సేకరించారు. మొదట సుందరమ్మాళ్‌కు మెడికల్ కిట్ ఇచ్చిన తర్వాత, అక్కడే మరో ఇంట్లో వైద్యం పొందుతున్న వసంత అనే మహిళను కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.ముత్తుసామి, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ అందియూరు పి.సెల్వరాజ్, ఈరోడ్ జిల్లా కలెక్టర్ రాజగోపాల్ సుంకర, వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ అరుణా, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్టాలిన్ ఈరోడ్ కళింగరాయన్ వసతిగృహంలో బసచేశారు. సాయంత్రం ఐదు గంటలకు అక్కడి నుంచి కారులో బయలుదేరి ఈరోడ్ మేట్టుకడై ప్రాంతంలోని తంగం మహల్‌లో ఏర్పాటు చేసిన డీఎంకే పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సాయంత్రం ఆరుగంటలకు ముత్తుమహల్‌లో జరిగే పార్టీ ప్రముఖుడు చంద్రకుమార్ ఇంటి వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, పార్టీ నేతలు హాజరయ్యారు.

నేడు అధికారులతో భేటీ...

శుక్రవారం ఉదయం ఈరోడ్ జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశమై ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఉదయం 10 గంటలకు కొత్త బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటయ్యే సభలో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఆయన సహాయాలు అందజేస్తారు. అదే సమయంలో చెన్నిమలై పట్టణపంచాయతీలో రూ.482 కోట్లతో నిర్మించిన సమగ్ర మంచినీటి పథకాన్ని స్టాలిన్ ప్రారంభించనున్నారు.

ఈపీఎస్ వ్యతిరేక పిటిషన్ల తోసివేత

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిని అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను పునఃపరిశీలించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. అన్నాడీఎంకేకు చెందిన రామ్‌కుమార్, కేసీ సురేన్ పళనిస్వామి మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం అన్నాడీఎంకే కార్యకర్తలు, ప్రధాన కార్యదర్శి పదవికి పోటీచేయడాన్ని అడ్డుకోనేలా 2022 జూలైలో నిర్వహించిన సర్వసభ్య మండలి సమావేశంలో, పార్టీ నియమనిబంధనలు సవరించారన్నారు. దీనికి వ్యతిరేకిస్తూ దాఖలుచేసిన కేసు ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉందని, విచారణలో ఉన్న కేసు తీర్పుకు ఎన్నికల కమిషన్ కట్టుబడి ఉండాలని ఆదేశించాలని అభ్యర్థించారు. అంతేగాక సవరించిన పార్టీ విధానాల ప్రకారం పళనిస్వామిని ప్రధాన కార్యదర్శిగా అంగీకరించిన ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను పునఃపరిశీలించేలా ఆదేశించాలని కూడా పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.సుబ్రమణ్యం, జస్టిస్ సి.కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో ఉన్న కేసులు ముగిసే వరకు అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించరాదనే పిటిషన్‌పై ఎన్నికల సంఘం నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని ఇప్పటికే ఆదేశించామని, అయినా మళ్లీ పిటిషన్లు వేశారంటూ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కేవలం ప్రచారం కోసమే పిటిషన్లు దాఖలు చేసినట్లు వుందని వ్యాఖ్యానిస్తూ.. పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని గురువారం అమరావతిలో కలుసుకున్న ఆ పార్టీ చెన్నై విభాగాధ్యక్షుడు చంద్ర శేఖర్. ఈ సందర్భంగా పార్టీ చెన్నై విభాగ అభివృద్ధిపై చర్చించారు.



గిండి రాజ్‌భవన్‌లో గ్రాండ్‌మాస్టర్ డి.గుకేష్‌ను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి దంపతులు

క్రైస్తవుడునని చెప్పుకునేందుకు గర్వపడుతున్నా

- కోవై క్రిస్మస్ వేడుకల్లో డిప్యూటీ సీఎం



కలైంజర్ నివాస పథకం కింద ఓ మహిళకు ఇంటిని కేటాయిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): అన్ని మతాలూ ఆత్మీయ భావాలనే బోధిస్తున్నాయని, తానొక క్రైస్తవుడినని చెప్పుకునేందుకు ఎంతగానో గర్వపడుతున్నానని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వ్యాఖ్యానించారు. కోయంబత్తూరు గాంధీపురం సమీపంలోని బేతేల్ క్రైస్తవ ఆలయంలో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉదయనిధి మట్లాడుతూ... ప్రపంచమంతా సంతోషంగా చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్ మాత్రమేనని చెప్పారు. క్రిస్మస్ అంటే తనకు చాలా ఇష్టమని, ఈ యేడాది క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని తానొక క్రైస్తవుడినని చెబితే ప్రత్యర్థులందరికీ కడుపుమంటగా మారిందన్నారు. ప్రజలు తనను క్రైస్తవుడిగా భావిస్తే క్రైస్తవుడని, ముస్లింగా భావిస్తే ముస్లిం అని, హిందువు అనుకుంటే హిందువేనని, అన్ని మతాలూ తనకు సమ్మతమేనని పేర్కొన్నారు. దేశంలో మత ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదన్నదే డీఎంకే అభిమతమన్నారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఇటీవల ఓ సభలో ముస్లింలకు వ్యతిరేకంగా విమర్శలు చేశారని, పార్లమెంట్‌లో ఆ న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించే బిల్లుకు డీఎంకే, కూటమి పార్టీల ఎంపీలంతా మద్దతు ప్రకటిస్తే అన్నాడీఎంకే మద్దతు ప్రకటించకుండా మౌనం పాటించిందని ఆరోపించారు. ఇలాంటి అన్నాడీఎంకేను మైనారిటీలకు రక్షణ కలిగించే పార్టీగా ఎవరు విశ్వసిస్తారని ప్రశ్నించారు. క్రైస్తవులు, ముస్లింలు ఎల్లప్పుడూ డీఎంకేకు మద్దతిస్తారని, వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా వారికి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఉదయనిధి వెల్లడించారు.

రూ.16లక్షల మాదకద్రవ్యాలు స్మగ్లర్లకు విక్రయం

- కానిస్టేబుల్ అరెస్టు



కానిస్టేబుల్ అరుణ్‌పాండ్యన్

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధాలు పెంచుకుని, రూ.16లక్షల విలువైన 2 కిలోల మెథాఫెటామైన్ మాదక ద్రవ్యాలను విక్రయించిన వాషర్‌మెన్‌పేట కానిస్టేబుల్ అరుణ్‌పాండ్యన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల స్మగ్లింగ్, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవలే గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక దళం పోలీసులు రంగంలోకి దిగి, నగరమంతటా నిఘా వేశారు. ఆ నేపథ్యంలో మాదక ద్రవ్యాలను విక్రయించిన కేసులో కేంద్ర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక విభాగంలో పనిచేస్తున్న సమీర్, ఆనంద్, జేమ్స్ అనే ముగ్గురు పోలీసులను అరెస్టు చేశారు. వీరిలో జేమ్స్ టి.నగర్ డీసీపీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు కానిస్టేబుళ్ల అరెస్టు సృష్టించిన కలకలం తగ్గకమునుపే వాషర్‌మెన్‌పేట పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న అరుణ్‌పాండ్యన్ అనే కానిస్టేబుల్ బుధవారం అరెస్టయ్యారు. ఇటీవల కారులో మాదక ద్రవ్యాలను తరలిస్తూ పెరంబూరుకు చెందిన బాలసుబ్రమణియం, అసోంకు చెందిన ఫాతిమ బేగం అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని విచారించగా మాదక ద్రవ్యాలను కానిస్టేబుల్ అరుణ్‌పాండ్యన్ వారికి సరఫరా చేసిన సంగతి వెల్లడైంది. దీంతో పోలీసు అధికారులు దిగ్భ్రాంతి చెందారు. అరుణ్‌పాండ్యన్ వాషర్‌మెన్ పేట పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ఆ స్టేషన్‌లో నమోదయ్యే కోర్టు కేసుల విచారణకు హాజరవుతుండేవాడు. 2022లో బాలసుబ్రమణియంపై వాషర్‌మెన్‌పేట పోలీసుస్టేషన్‌లో మాదకద్రవ్యాల కేసు నమోదైంది. ఆ కేసు విచారణకు అరుణ్‌పాండ్యన్ వెళ్ళినప్పుడే అతడితో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. బాలసుబ్రమణ్యం ఇచ్చిన సమాచారంతో కానిస్టేబుల్ అరుణ్‌పాండ్యన్‌కు మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాతో పరిచయం పెంచుకున్నాడు. వివిధ మాదక ద్రవ్యాల కేసుల్లోనూ స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను ఉన్నతాధికారులకు తెలియకుండా విక్రయించాడు. ఇప్పటి వరకూ రూ.16లక్షల విలువ కలిగిన 2 కేజీల మెథాఫెటామైన్ అనే మాదక ద్రవ్యాన్ని కానిస్టేబుల్ అరుణ్‌పాండ్యన్ విక్రయించినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ మాదక ద్రవ్యాల అమ్మకాల కేసులో సాయుద్దీన్ అసామ్, ముజాఫిర్ అనే ఇద్దరి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.





కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనా కార్యక్రమాలు - నుంగంబాక్కం వల్లువర్ కోటం వద్ద ధర్నాలో పాల్గొన్న డీఎంకే శ్రేణులు

అమిత్‌షా వ్యాఖ్యలపై మంటలు

రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఆందోళన

ప్యారీస్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ఆయన్ని కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ డీఎంకే ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహించారు. డీఎంకే అధిష్టానం పిలుపు మేరకు నుంగంబాక్కం వల్లువర్ కోటం వద్ద పార్టీ ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి అధ్యక్షతన జరిగిన ధర్నాలో పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ఆందోళనా కార్యక్రమాల్లో డీఎంకే మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు పాల్గొని అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. తమిళనాడు పాలక పక్ష నేతలు నుంగంబాక్కం, మైలాపూర్ సిటీ సెంటర్, ఓటేరీ, చేపాక్కం, సైదాపేట ప్రాంతాల్లో ధర్నా నిర్వహించి, అంబేడ్కర్‌ని అవమానించిన అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

రాజధాని కళాశాల విద్యార్థుల నిరసన

రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను కించపరచేలా వ్యాఖ్యానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డౌన్.. డౌన్ అంటూ రాజధాని కళాశాల విద్యార్థులు నిరసనలు తెలియజేశారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను హోంమంత్రి పదవి నుంచి తక్షణమే తొలగించాలంటూ గురువారం నిర్వహించిన ధర్నాలో రాజధాని కళాశాల విద్యాలు, ఎస్ఐఎఫ్ విద్యార్థులు ప్లకార్డులతో పాల్గొన్నారు మెరీనా బీచ్ రోడ్డులోని కళాశాల ముందున్న ఫుట్‌పాత్‌పై సుమారు 50 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.



పుదుచ్చేరిలో డీఎంకే ధర్నా

ఆర్థిక నేరాలను సమన్వయంతో విచారించాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పెరంబూర్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలను సమన్వయంతో విచారించి పరిష్కరించాలని 'ఆర్ఈఐసీ' సమావేశంలో నిర్ణయించారు. రీజినల్ ఎకనామిక్స్ ఇంటెలిజెన్స్ కౌన్సిల్ (ఆర్ఈఐసీ) 140వ సమావేశం గురువారం తమిళనాడు, పుదువై ఆదాయపు పన్ను డైరెక్టర్ జనరల్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలో జరిగింది. సమావేశంలో, ఆర్థిక నేరాలు జరిగే తీరు,విదేశీ నల్లధనం,పన్ను ఎగవేత, మనీ లాండరింగ్, నకిలీ ఇన్వాయిస్ లు, నకిలీ కరెన్సీ, టెర్రర్ ఫండింగ్ తదితరాలపై ఆయావిభాగాల నిపుణులు వివరించారు. ఆర్థిక నేరాలను అడ్డుకొనేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్ (డీవీఏసీ) డీజీ అభయ్‌కుమార్ సింగ్, డీఆర్ఐ ఏడీజీ సుభాష్ అగర్వాల్, డీజీజీఐ ఏడీజీ కె.బాలమురున్, ఈఏడబ్ల్యూ ఐజీపీ సత్యప్రియ, సీబీఐ డీఐజీ డా.సోనాల్ చంద్ర సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9. గంటల నుంచి మధ్యాహ్నం 2. గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలు... నప్పాళయంలోని మనలి న్యూటౌన్, విచూర్ సిట్కో ఎస్టేట్, కులక్కరై, ఐజేపురం, ఈసీఎల్‌నగర్, గణపతినగర్, శ్రీరామ్‌నగర్, అరుళ్‌మురుగన్ నగర్, వెల్లివాయల్, నప్పాళయం, ఇటియంచావడి, వెళ్లివాయల్‌చావడి, కొండగ్రై, ఎక్కల్ కాలనీ, పొన్నియమ్మన్ నగర్, సెమ్మణలి, ఎంఆర్ఎఫ్ నగర్, సుబ్రమణి నగర్, తిరువర్క్కాడులోని సుందరచోళపురం, రామ్‌నగర్, సుందరవినాయక నగర్, నెల్లియమ్మన్‌నగర్, దేవీనగర్, సుమంగళి, మానసరోవర్ అపార్ట్‌మెంట్, సాయి అవెన్యూ అపార్ట్‌మెంట్, మాదర్వేడు పెరుమాళ్ కోవిల్ స్ట్రీట్, వేలప్పల్ నగర్, పద్మావతి నగర్, మెట్టువీధి, మెహతా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలియజేశారు.

'కాపు సేవా సమితి' ఆధ్వర్యంలో 29న సంక్రాంతి సంబరాలు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'కాపు సేవా సమితి' ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ సంక్రాంతి సంబరాలు జరుగనున్నాయి. పెరంబూరులో వున్న డీఆర్‌బీసీసీఎస్ హయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంగణంలో జరిగే ఈ వేడుకల్లో భాగంగా వంటలు, ముగ్గులు, జానపద గేయాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. మరిన్ని వివరాలకు కాపు సేవా సమితి అధ్యక్షుడు గూడపాటి జగన్‌మోహన్‌రావు (9840814589), కార్యదర్శి పీఆర్ కేశవులు (9790840088)ను సంప్రదించవచ్చు.

'వైగై ఎక్స్‌ప్రెస్'కు మేల్‌మరువత్తూరులో స్టాపింగ్

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదురై-ఎగ్మూర్ మధ్య నడుస్తున్న 'వైగై ఎక్స్‌ప్రెస్' (12636) తైపూస మాసోత్సవాలు, ఇరుముడిని పురస్కరించుకుని ఫిబ్రవరి 11వ తేదీ వరకు మేల్‌మరువత్తూరులో 2 నిమిషాల పాటు ఆగనుంది. భక్తుల వినతులను దృష్టిలో పెట్టుకుని మేల్‌మరువత్తూరులో అదనపు స్టాప్ కల్పించినట్లు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

1 వరకు హైకోర్టుకు క్రిస్మస్ సెలవులు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టుతో పాటు మదురై ధర్మాసనానికి జనవరి 1వ తేదీ వరకు క్రిస్మస్ సెలవులు ప్రకటించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎస్.అల్లి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 22వ తేదీ (ఆదివారం) నుంచి జనవరి 1వ తేదీ వరకు సెలవు ఇవ్వనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అత్యవసర కేసుల కోసం ఈ నెల 27వ తేదీ వెకేషన్ బెంచ్ ఏర్పాటు చేయనుండగా, జస్టిస్ ఎం.సుబ్రమణ్యం, జస్టిస్ ఎల్.విక్టోరియా గౌరి, జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ తమకు కేటాయించిన విభాగాల కేసులపై విచారణ చేపట్టనున్నారు. అదేరోజు మదురై ధర్మాసనం వెకేషన్ న్యాయమూర్తులుగా జస్టిస్ పి.వేల్‌మురుగన్, జస్టిస్ పి.ధనపాల్, జస్టిస్ జ్యోతిరామన్ వ్యవహరించనున్నారు.

8,997 అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీ

పెరంబూర్, డిసెంబరు 19)ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పథకంలో 8,997 అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు నెలకు రూ.3,000 వేతనం ఇవ్వాలని, వారి 12 నెలల సర్వీసు సంతృప్తికరంగా ఉంటే అందుకు అనుగుణంగా వేతనం పెంచనున్నారు. 10వ తరగతి కనీస విద్యార్హత ఉన్న వారు ఈ పోస్టుకు అర్హులు. ఈ పోస్టుల భర్తీకి డిప్యూటీ డైరెక్టర్‌ను నామినేటింగ్ అధికారిగా నియమించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.27 కోట్ల భారం పడనుందని అధికారులు తెలిపారు.

నేటినుంచి మదురైలో రాత్రి విమాన సర్వీసులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబర్19 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి మదురైకి మొదటిసారిగా రాత్రి పూట విమాన సర్వీసులను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇండిగో విమాన సంస్థ ఈ సర్వీసును ప్రారంభించనుంది. చెన్నై నుంచి 9.గంటలకు ఏటీఆర్ 72 రకం విమానం బయలుదేరి రాత్రి 10.25 గంటలకు మదురై చేరుకోనున్నది. ఇటీవలే మదురైలో రాత్రి పూట విమానాలు దిగడానికి అనువుగా కొత్త కంట్రోల్ టవర్, అగ్నిమాపక విభాగం, నావిగేషన్ లైట్లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళ అధికారులు ఆ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో శుక్రవారం నుంచి మదురై విమానాశ్రయంలో రాత్రి పూట విమానాలు దిగనున్నాయి.

27 నుంచి పలు రైళ్ల రద్దు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా చెన్నై నుంచి దక్షిణాది జిల్లాల వైపు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. రద్దయిన రైళ్ల వివరాలిలా వున్నాయి...

- ఈ నెల 27, 28 తేదీల్లో తాంబరం నుంచి రామనాథపురం వెళ్లాల్సిన ప్రత్యేక రైలు (06103)
- ఈ నెల 27, 29 తేదీల్లో రామనాథపురం నుంచి తాంబరం వెళ్లాల్సిన ప్రత్యేక రైలు (06104)
- ఈ నెల 27, 28, 29, 31 తేదీల్లో తిరుచ్చి నుంచి తాంబరం వెళ్లే సూపర్‌ఫాస్ట్ ప్రత్యేక రైలు (06190)
- ఈ నెల 27, 28, 29, 31 తేదీల్లో తాంబరం తిరుచ్చి బయలుదేరాల్సిన ప్రత్యేక రైలు (06191)
- ఈ నెల 26, 28 తేదీల్లో మంగళూరు నుంచి కొచ్చువేలి బయలుదేరాల్సిన ప్రత్యేక రైలు (06041)
- ఈ నెల 27, 29 తేదీల్లో కొచ్చువేలి నుంచి మంగళూరు బయలుదేరాల్సిన ప్రత్యేక రైలు (06042)

ఒకే సారి 555 మందికి వర్మ చికిత్స

● తాంబరం సిద్ధవైద్య సంస్థ గిన్నిస్ రికార్డు



రోగులకు వర్మ చికిత్స చేస్తున్న సిద్ధవైద్య వైద్యులు - ఆస్పత్రి నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న గిన్నిస్ ప్రతినిధి విలియం రాబర్ట్

టి.నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒకే సమయంలో 555 వర్మ చికిత్స నిపుణుల ద్వారా 555 మందికి చికిత్స చేసి జాతీయ సిద్ధ వైద్య సంస్థ (ఆసుపత్రి) ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఈ సిద్ధ వైద్య సంస్థ నిర్వాహకులు దేశవ్యాప్తంగా సిద్ధ వైద్యానికి ప్రాచుర్యం కల్పించేలా గత యేడాది ఢిల్లీ నుంచి కన్నియాకుమారి వరకు ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు.. 3333 కి.మీ. 20 రోజుల్లో ప్రయాణించి ప్రతిరోజూ ఓ రాష్ట్రంలో సిద్ధ వైద్య శిబిరాలు, ప్రచార కార్యక్రమాలను చేపట్టి పలువురి ప్రశంసలందుకున్నారు. అదే రీతిలో సిద్ధ వైద్యంలోని వర్మ వైద్య పద్ధతులపై ప్రపంచ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు జరపాలని ప్రయత్నిస్తున్నారు. ఆ మేరకు బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఒకే సమయంలో 555 మంది వర్మ చికిత్సా నిపుణుల ద్వారా 555 మందికి స్వీయరక్షణ వర్మ వైద్య పరిహారాలను అందించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. గిన్నిస్ సంస్థ ప్రతినిధి విలియం రాబర్ట్ ఆ జాతీయ సిద్ధ వైద్య సంస్థ (ఆసుపత్రి) నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆ వైద్య సంస్థ సంచాలకులు డాక్టర్ ఆర్.మీనాకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ గోట్చే ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. సిద్ధ వైద్య సంస్థ డీన్ డాక్టర్ ఎం. మీనాక్షి సుందరం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ క్రిష్టియానా తదితరులు పాల్గొన్నారు. వర్మ చికిత్స గురించి డాక్టర్ మీనాకుమారి మాట్లాడుతూ సిద్ధ వైద్యంలో తక్షణ పరిష్కారం ఆచరించే అద్భుతమైన వైద్య విధానం వర్మ చికిత్స అని, వర్మకళ అనేది ఆత్మరక్షణకు ఉపయోగపడేదిగా భావిస్తున్నప్పటికీ ఈ వర్మచికిత్స అంతర్యాగమని చెప్పారు. మందులులేని చికిత్సా పద్ధతి కూడా ఇదేనని చెప్పారు. మెదడు, నాడీ మండలానికి సంబంధించిన పక్షవాతం, మూర్ఛ, వెన్నెముక, కీళ్ల నొప్పులు వంటి సమస్యలను వైద్య నిపుణులు ఎలాంటి పరికరాలు ఉపయోగించకుండా రెండు చేతులతో మసాజ్ చేస్తూ రోగులను త్వరగా కోలుకునేలా చేస్తారని ఆమె వివరించారు. ప్రమాదాల్లో గాయపడేవారికి తక్షణ ఉపశమనం అందించేది కూడా ఈ వర్మ చికిత్సేనని చెప్పారు. భారతీయ సిద్ధవైద్యంలో ఈ వర్మ చికిత్స ప్రధాన పాత్రను పోషిస్తుందనటం అతిశయోక్తి కాదని ఆమె పేర్కొన్నారు.

సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ ఇంట్లో సీబీఐ సోదాలు

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో చిక్కుకున్న మదురై సెంట్రల్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఇంట్లో సీబీఐ అధికారులు గురువారం సోదాలు చేపట్టారు. కేంద్ర ఎక్సైజ్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్లు రూ.3.50 లక్షలు లంచం తీసుకుంటున్నారంటూ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. దాంతో ముందస్తు ప్రణాళిక మేరకు అధికారులు ఆ సూపర్‌వైజర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా ఈ వ్యవహారంలో జాయింట్ కమిషనర్ శరవణకుమార్ ప్రమేయం ఉందని తెలిపారు. దీంతో, తంజావూరు జిల్లా తిరువిడైమరుదూర్ వీఎంబీ నగర్‌లో ఉన్న శరవణకుమార్ ఇంట్లో సీబీఐ డీఎస్పీ నేతృత్వంలో ఐదుగురు అధికారుల బృందం గురువారం ఉదయం 8 గంటలకు వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తలుపులు మూసి ఉండడంతో, అధికారులు 6 గంటల పాటు అక్కడే వేచి ఉన్నారు. అనంతరం శరవణకుమార్ సోదరుడు కన్నన్ రావడంతో, అతని పర్యవేక్షణలో ఇంట్లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

తిరుచెందూర్‌లో ఓపీఎస్ పూజలు



మురుగన్ ఆలయంలో పన్నీర్‌సెల్వం

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం ప్రత్యేక పూజలు చేశారు. మార్గళి మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, గురువారం వేకువజామున 3 గంటలకు ఆలయానికి వచ్చిన ఓపీఎస్, 3.30 గంటలకు జరిగిన విశ్వరూప దర్శనంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం పంచమూర్తుల సన్నిధుల్లో పూజలు చేశారు.

'జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ' సభ్యుడిగా సురేష్‌బాబు



చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా తెలుగు ప్రముఖుడు, 'సురేష్ ఎన్ సురేష్ ఎక్స్‌పోర్ట్స్' అధినేత కేఎన్ సురేష్‌బాబు నియమితులయ్యారు. ఆయన 2026 సెప్టెంబరు 30వ తేదీ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయన 'ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్' నుంచి ఈ పదవికి ఎంపికయ్యారు. సురేష్‌బాబు గతంలో డీఆర్‌యూసీసీ సభ్యుడిగా, రోటరీ క్లబ్ ఆఫ్ రాయపేట అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్ర కళాస్రవంతి ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్‌గా, ప్రపంచ తెలుగు సమాఖ్య సభ్యత్వ నమోదు కమిటీ ఛైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నారు. అంతేగాక పలు తెలుగు, సామాజిక, వాణిజ్య సంస్థల్లోనూ వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

డాన్‌బాస్కో స్కూలు వద్ద 'టవర్ క్లాక్'



టవర్ క్లాక్ ఏర్పాటులో ప్రముఖులు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని డాన్‌బాస్కో మెట్రిక్ హయ్యర్ సెకండరీ స్కూలు వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టి.నగర్ నిర్వాహకులు మొట్టమొదటిసారిగా 'టవర్ క్లాక్' ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధాన గేటు వద్ద దీనిని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన టవర్‌క్లాక్ ఆవిష్కరణ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3233 గవర్నర్ మహావీర్ బోత్రా, మాజీ అధ్యక్షులు పంకజ్ దవే, రాజా మాణిక్యం, రవి వెంకట్రామన్, కార్యదర్శి డాక్టర్ పూర్ణిమ, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జేవియర్ పాకియాం తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై విద్యార్థి

● తండ్రిపై కేసు నమోదుచేయాలని ఆదేశించిన కలెక్టర్



విద్యార్థికి కౌన్సెలింగ్ ఇస్తున్న కలెక్టర్ ఉమ

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం నడిపిన పాఠశాల విద్యార్థి తండ్రిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనం స్వాధీనం చేసుకోవాలని నామక్కల్ జిల్లా కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. 'ఉంగల్ తేడి ఉంగల్ ఊరిల్' పథకంలో భాగంగా రాశిపురంలో నిర్వహించిన కార్యక్రమానికి నామక్కల్ జిల్లా కలెక్టర్ ఉమ కారులో బయల్దేరారు. తోప్పపట్టి ప్రాంతంలో యూనిఫాం ధరించిన పాఠశాల విద్యార్థి ద్విచక్రవాహనంపై రావడం గమనించిన కలెక్టర్, ఆ విద్యార్థిని ఆపారు. 'డ్రైవింగ్ లైసెన్స్ ఉందా?' అంటూ కలెక్టర్ ప్రశ్నించగా, లేదని సమాధానమిచ్చాడు. దీంతో, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని, విద్యార్థి తండ్రిపై కేసు నమోదుచేసి జరిమానా విధించాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు.

23న డీఎంకే ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్

ఐసిఎఫ్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఆధ్వర్యంలో ఈనెల 23వ తేది సెమి క్రిస్మస్ నిర్వహించనున్నారు. పెరంబూర్ డాన్‌బాస్కో పాఠశాల ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు జరుగనున్న వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు, పలు సంఘాలు (సీఎస్ఐ, ఈసీఐ, లూథరన్) సంఘ సభ్యులతో కలసి క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుగనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు.

చెరువులో ఆక్రమణలను తొలగించాలి

● పశువులతో రాస్తారోకో చేసిన స్థానికులు



పశువులతో రాస్తారోకో చేస్తున్న అంబేద్కర్ నగర్ వాసులు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా ఆరూరు అంబేద్కర్ నగర్ సమీపంలోని నాశనేరి చెరువు దురాక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పశువులను రోడ్డుపై నిలిపి గురువారం ఉదయం రాస్తారోకో జరిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 17 ఎకరాల చెరువు యేళ్ల తరబడి ఆక్రమణలకు గురై 7 ఎకరాలకు తగ్గిపోయింది. పది ఎకరాల చెరువు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని ఆ స్థలం చుట్టూ కంచె కూడా నిర్మించుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కబ్జా గురైన ఆ స్థలాలను స్వాధీనం చేసుకుని ఆ చెరువుకు పూర్వవైభవం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు తమ పశువులను రోడ్డుపై నిలిపి రాస్తారోకో జరిపారు. ఈ ఆందోళన కారణంగా సుమారు రెండు గంటలపాటు ఆరూరు - తిరువణ్ణామలై రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారి చిన్నుసామి, డీఎస్పీ కరికాల పారి శంకర్, తహసీల్దార్ రాధాకృష్ణన్ హుటాహుటిన అక్కడికి వెళ్లి వీలైనంత త్వరగా చెరువు కబ్జాలను తొలగించి చెరువులో పూడికతీస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించుకున్నారు.

పీఎఫ్ పింఛన్‌దారుల ధర్నా



రాయపేట పీఎఫ్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు

ప్యారీస్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ ప్రాంగణంలో పింఛన్‌దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ప్రైవేటు కర్మాగారాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కార్మికులకు పిఎఫ్ పథకంలో ఇచ్చే పింఛన్‌ను రూ.9వేలకు పెంచాలని కోరుతూ ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో చెన్నై ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం, అఖిలభారత పింఛనుదారుల సంఘం, తమిళనాడు పెన్షనర్ల సంఘానికి చెందిన సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ ధర్నాకు నాయకత్వం వహించిన కేపీ బాబు మాట్లాడుతూ పింఛన్ నిధుల పథకంలో దేశవ్యాప్తంగా 80 లక్షల లబ్ది పొందుతున్నారని, ఇందులో 36 లక్షల మంది రూ.1000 కంటే తక్కువ పింఛన్ పొందుతున్నారని, ఆ పింఛన్‌ను గరిష్ఠంగా రూ.4వేలకు పైగా పొందేవారు ఎవరూ లేరన్నారు. పాత పింఛన్ పథకం కింద ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న వేతనంలో జమచేసుకుంటున్న సగం మొత్తాన్ని పింఛన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు

ఐసిఎఫ్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నామలైపురంలో ఉన్న అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను శబరిమల ప్రధాన తంత్రీ టీకే మోహన్ ప్రారంభించనున్నారు. ఈ నెల 21వ తేది ఉదయం గణపతి హోమం, అభిషేకం, సాయంత్రం 6 గంటలకు గొడుగులు ఏర్పాటుచేయనున్నారు. 22వ తేది ఉదయం 1,008 సహస్ర కలశాభిషేకం, 24,25 ఉదయం కలశ ద్రవ్యాభిషేకం జరుగనున్నాయి. 25వ తేది సాయంత్రం వెండి రథం ఊరేగింపు జరుగనుంది. ప్రతిరోజు సాయంత్రం 18 మెట్ల పూజలు నిర్వహించనున్నామని, 26వ తేది వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

22 నుంచి మహాబలిపురంలో నాట్యోత్సవాలు

ప్యారీస్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో నాట్యోత్సవాలు ఈ నెల 22న ప్రారంభమై నెల రోజులపాటు కొనసాగుతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖా అధికారులు తెలిపారు. మహాబలిపురం బంగాళాఖాతం తీరంలోని ఆలయ ప్రాంగణంలో ఈ సంవత్సరం కూడా 30 రోజులపాటు భారతీయ సంప్రదాయ, శాస్త్రీయ, పారంపర్య ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పర్యాటక శాఖా ఏర్పాట్లు సిద్ధం చేసింది. వచ్చే ఆదివారం ప్రారంభించనున్న ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భరతనాట్యం, కూచిపూడి నాట్యాలతోపాటు కేరళ, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు, జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

లంక చెర నుంచి జాలర్ల విడుదల

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలపాటు శ్రీలంక చెరలో గడిపిన రామేశ్వరం ప్రాంతానికి చెందిన 14 మంది జాలర్లను విడుదల చేస్తూ అక్కడి మన్నార్ కోర్టు ఆదేశాలిచ్చింది. రామేశ్వరం సమీపం ధనుష్కోడి, తలైమన్నార్ ప్రాంతాల నడుమ ఈ నెల 5న చేపలు పడుతున్న రామేశ్వరం జాలర్లు 14 మందిని శ్రీలంక నావికాదళం తమ దేశ సరిహద్దులోకి ప్రవేశించారంటూ నిర్బంధించింది. ఈ జాలర్ల పడవలో ఉన్న వలలు, సామగ్రిని కూడా ధ్వంసం చేసింది.. ఈ నేపథ్యంలో అరెస్టయిన జాలర్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ రామనాథపురం జిల్లాలోని వివిధ జాలర్ల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ నేపథ్యంలో మన్నార్‌కోర్టు లో గురువారం ఉదయం 14 మంది జాలర్లను హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ విచారణ జరిపి ఆ జాలర్లకు తలా రూ.50వేల జరిమానా విధిస్తూ విడుదల చేశారు. ఆ కోర్టు ఉత్తర్వు ప్రకారం విడుదలైన ఆ జాలర్లను స్వస్థలాలకు తరలించేందుకు శ్రీలంకలోని రాయబార కార్యాలయ అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

బ్యాంకు ఉద్యోగిపై దాడి

● తీవ్రగాయాలతో మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని ఓ ప్రవేట్ బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తి ఖాతాదారుడిగా వచ్చి బ్యాంకు ఉద్యోగిని నరికి చంపాడు. వివరాల్లోకి వెళ్తే టి.నగర్‌లోని బర్కిత్ రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో దినేష్ పనిచేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఖాతాదారుడిగా వచ్చి దినేష్‌తో మాట్లాడుతూ కొడవలితో దాడి చేయగా దినేష్‌కు తీవ్రగాయాలు కావడంతో వెంటనే సహచర ఉద్యోగులు, ప్రజలు ఆగంతకుడిని పట్టుకుని టి.నగర్ పోలీసులకు అప్పగించారు. అదేవిధంగా గాయపడిన ఉద్యోగి దినేష్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దినేష్ మృతిచెందాడు. హత్యకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నారు.

జైలర్‌ను బెదిరించిన ఖైదీలు

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కార్యాలయంలో జైలర్‌ను బెదిరించిన ముగ్గురు ఖైదీలపై కేసు నమోదైంది. పుళల్ జైల్లో బందీలుగా ఉన్న మణవానన్, కార్తిక్, ఇలన్‌తమిళన్ సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారనే సమాచారంతో, బుధవారం రాత్రి జైలర్ మణికంఠన్ నేతృత్వంలో జైలు సిబ్బంది వారి గదుల్లో తనిఖీలకు వెళ్లారు. వారిని అడ్డుకున్న ముగ్గురు ఖైదీలు, జైలర్ ఇంటిపై పెట్రోల్ బాంబుతో దాడిచేస్తామని బెదిరించారు. ఈ వ్యవహారంపై జైలర్ మణికంఠన్ ఫిర్యాదుతో పుళల్ పోలీసులు మణవానన్, కార్తిక్, ఇలన్‌తమిళన్‌లపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సముద్రంలో పడిన డ్రైవర్ మృతదేహం లభ్యం

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్‌లో కారుతో సహా సముద్రంలో పడిన డ్రైవర్ మృతదేహం లభ్యమైంది. హార్బర్ సమీపంలోని కోస్ట్‌గార్డ్ అధికారిని తీసుకొచ్చేందుకు వెళ్లిన డ్రైవర్ మహమ్మద్ షాహి, కారు రివర్స్ చేస్తున్న సమయంలో సముద్రంలో పడిపోయాడు. మహమ్మద్ షాహి కోసం గాలిస్తున్న నేపథ్యంలో, అతని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మేట్టూరు జలవిద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదం

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు జలవిద్యుత్ కేంద్రంలో గురువారం హఠాత్తుగా సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. మేట్టూరు జలాశయం సమీపంలో రెండు జల విద్యుత్ కేంద్రాలున్నాయి. గురువారం ఈ కేంద్రంలో హఠాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని, తీవ్రంగా గాయపడిన ముగ్గురిని రక్షించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు చిక్కుకుని మరణించినట్టు పోలీసులు తెలిపారు.

కబ్జాకు గురైన దేవాలయ ఆస్తుల స్వాధీనం



తీర్థపాలీశ్వరాలయం

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల క్రితం ఆక్రమణలకు గురైన ట్రిప్లికేన్ అరుళ్మిగు తీర్థపాలీశ్వరాలయానికి చెందిన రూ.3.5 కోట్ల విలువైన ఆస్తులను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఆ ఆలయానికి సర్వే నెం 826/1లో ఉన్న 560 చదరపుటడుగుల వాణిజ్య స్థలం, సర్వే నెం 826/8లో ఉన్న 2886 చదురపుటడుగుల నివాస స్థలం మొత్తం 3,446 చదురపుటడుగుల భూమిని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.3.5 కోట్లు ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

అడవిలో గంజాయి సాగు

● ఇద్దరు యువకుల అరెస్టు



అరెస్టయిన యువకులతో అటవీ శాఖ సిబ్బంది

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా కల్వరాయన్‌మలైలో అడవిలో గంజాయి సాగు చేసిన ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. కల్వరాయన్‌మలై కల్తీసారా తయారీకి పెట్టింది పేరు. అక్కడ తయారుచేసిన కల్తీసారా కొద్ది నెలల క్రితం 63 మందిని పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ కొండపైన చిట్టడివిలో గంజాయిని సాగుచేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఆ ప్రాంతానికి వెళ్ళి అటవీశాఖ సిబ్బంది అక్కడ పెరుగుతున్న 1600 గంజాయి చెట్ల నరికి తరలించారు. ఆ సంఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.

జీఎస్టీ రోడ్డులో వాహనాల పార్కింగ్ !

● క్రోంపేట - తాంబరం రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు శాశ్వతపరిష్కారం లభించేనా?



క్రోంపేటలో హోటళ్ళ ఎదురుగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు - ప్రముఖ జౌళిదుకాణం ప్రాంతంలో రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

టి.నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రం టి.నగర్‌కు ధీటుగా దక్షిణ చెన్నైలోని క్రోంపేట-తాంబరం జీఎస్టీ రోడ్డులో వాణిజ్య సంస్థలు, దుకాణాలున్నాయి. జాతీయ రహదారి శాఖ పరిధిలో ఉన్న ఈ ప్రధాన రహదారిలో 15 యేళ్లుగా వాణిజ్య సంస్థలు విపరీతంగా పెరుగుతున్నాయి. అయినా దుకాణాల వద్ద వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్ సదుపాయాలు లేవు. ఈ వాణిజ్య సంస్థల భవనాల నిర్మాణానికి అనుమతిచ్చినప్పుడే, పార్కింగ్‌కు కూడా అనుమతిస్తున్నారు. అయితే వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో కూడా ఈ వాణిజ్య సంస్థలు దుకాణాలను నడుపుతున్నాయి. దీంతో జీఎస్టీ రోడ్డులో క్రోంపేట - పల్లావరం వరకు, సుమారు 2 కి.మీ. వరకు విస్తరించి ఉన్న ఈ వాణిజ్య సంస్థలు, దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులంతా తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో 'పీక్-అవర్'లో ఆ రహదారిలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరుగుతోంది. తాంబరం కార్పొరేషన్, సీఎండీఏ సంయుక్తంగా పార్కింగ్ కోసం అనుమతించిన స్థలాల్లో దుకాణాలు నడుపుతున్న వాణిజ్య సంస్థలకు భారీ స్థాయిలో జరిమానా విధించి, ఆయా ప్రాంతాలలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తేనే ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదు. ఈ విషయమై అరప్పోర్ ఇయక్కం సంస్థకు చెందిన డేవిడ్ మనోహరన్ మాట్లాడుతూ క్రోంపేట జీఎస్టీ రోడ్డు, పల్లావరం - దురైపాక్కం రేడియల్ రహదారుల్లో ఉదయం, సాయంత్రం విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడటం సర్వసాధారణమైపోయిందన్నారు. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్ల వద్ద పార్కింగ్ సదుపాయం ఉన్నప్పటికీ ఆ స్థలాల్లోనూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, లేదా రోడ్‌సైడ్ బజ్జీల దుకాణాలు, చిన్న చినన దుస్తుల దుకాణాలు నడిపి వాటి ద్వారా వచ్చే అద్దెలతో తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని ఆరోపించారు. ఇక ఆ మార్గంలో పార్కింగ్ స్థలమే లేకుండా నడిపుతున్న రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లకు తాంబరం కార్పొరేషన్, సీఎండీఏ అధికారులు ఎలా లైసెన్స్ ఇచ్చారో అర్థం కావటం లేదన్నారు. తమ వాణిజ్య సంస్థలు, దుకాణాల వద్ద పార్కింగ్ సదుపాయం ఉందని కార్పొరేషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి, లైసెన్సులు తీసుకున్నారని తెలిపారు. దీంతో రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ రద్దీ అధికమవుతోందని, ఈ విషయంపై తాంబరం కార్పొరేషన్ ఉన్నతాధికారులు, సీఎండీఏ ఉన్నతాధికారులు ఈ రెండు కిలో మీటర్ల రహదారికిరువైపులా ఉన్న వాణిజ్య సంస్థలు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేసి పార్కింగ్ సదుపాయం లేని వారికి భారీగా జరిమాన విధించడంతో పాటు, వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడమే ఆ జీఎస్టీ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ నిరోధించడానికి శాశ్వత పరిష్కారం కాగలదని ఆయన తెలిపారు. ఇప్పటికైనా తాంబరం కార్పొరేషన్ పాలకులు, సీఎండీఏ నిర్వాహకులు ఈ దిశగా చర్యలు చేపడతారని ఆశిద్దాం!.


రేష్మ పసుపులేటి

బరువు తగ్గిన రేష్మ

కోలీవుడ్‌లోని తెలుగు హీరోయిన్ రేష్మ పసుపులేటి మరింత స్లిమ్‌గా కనిపించేందుకు ఏకంగా 12 కేజీల మేరకు బరువు తగ్గింది. గతంలో సూరి హీరోగా నటించిన 'వేలైను వందుట్టా వెళ్లైక్కారన్' అనే సినిమాలో నటించారు. ఇందులో ఆమె పోషించిన 'పుష్ప' పాత్రకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపుతో పాటు ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాలతో పాటు టీవీలో 'భాగ్యలక్ష్మి', 'దీపం' వంటి సీరియల్స్‌లో నటించింది.. ఈ క్రమంలో ఆమె ఒక్కసారిగా బరువు పెరిగిపోయింది. దీంతో గత 9 నెలలుగా వివిధ రకాలైన ఆహార నియమాలు పాటించి 12 కేజీల బరువుతగ్గారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. ఇపుడు తాను కమిట్ అయిన చిత్రాల్లో నటించేందుకు సమాయత్తమవుతున్నట్టు పేర్కొన్నారు.

'స్వరకర్తగా' జీవీకి వందో చిత్రం



ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ స్వరకర్తగా వందో చిత్రానికి సంగీతం అందించనున్నారు. వసంత బాలన్ తెరకెక్కించిన 'వెయిల్' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు సంగీత దర్శకుడిగా పరిచయమైన జీవీ ప్రకాష్.. ప్రస్తుతం సుధా కొంగర - శివకార్తికేయన్ కాంబోలో తెరకెక్కనున్న 'పురనానూరు' సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇది జీవీ ప్రకాష్ కుమార్‌కు వందో చిత్రం కావడం గమనార్హం. దీంతో తన ఫ్యాన్స్‌తో పాటు సంగీత అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. 'నా సంగీత ప్రయాణం 2005లో మొదలైంది. 2024లో 100వ సినిమాకు సంగీతం అందించే అవకాశం వచ్చింది. 'సూరరై పొట్రు'తో జాతీయ అవార్డు అందుకున్నాను. ఈ సినిమాను తెరకెక్కించిన సుధా కొంగర దర్శకత్వంలోనే నా వందో చిత్రానికి పని చేస్తున్నాను. సంగీత దర్శకుడిగా 19 యేళ్ళ సినీ ప్రయాణంలో నాకు అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, దర్శకులు, గాయకులు, గీత రచయితలు, నన్ను ప్రోత్సహిస్తున్న సంగీత అభిమానులకు ఇలా ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఒక సంగీత దర్శకుడిగా, నటుడిగా మరింత శ్రమించాలని భావిస్తున్నాను' అని వెల్లడించారు.

ఆ ఫోన్‌కాల్ రాకుంటే ఈ జీవితమే లేదు : హీరో సూర్య


సూర్య - బాల

దర్శకుడు బాల నుంచి 2000లో ఆ ఫోన్‌కాల్ రాకుంటే తనకు ఈ జీవితమే ఉండేదికాదని హీరో సూర్య అన్నారు. సినీ దర్శకుడు బాల చిత్ర పరిశ్రమకు వచ్చి 25 యేళ్ళు పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి 'బాల-25' పేరుతో సన్మాన కార్యక్రమం జరిగింది. అలాగే, బాల దర్శకత్వం వహించిన 'వణంగాన్' చిత్ర ఆడియో, ట్రైలర్ కూడా విడుదల చేశారు. ఇందులో అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొని బాలను అభినందించారు. హీరో సూర్య మాట్లాడుతూ, 'బాల డైరెక్ట్ చేసిన 'నంద' సినిమా చూసి దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ 'కాక్కకాక్క'లో నాకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఏఆర్ మురుగదాస్ 'గజినీ' కోసం పిలిచారు. దీనికంతటికి కారణం దర్శకుడు బాల. ఈయన దర్శకత్వంలో వచ్చిన విక్రమ్ నటించిన 'సేతు' సినిమా నాలో బలమైన ముద్ర వేసింది. ఒక నటుడు ఇలా నటించగలడా? దర్శకుడు ఇలాంటి చిత్రాన్ని తీయగలడా? ఇలా అనేక ప్రశ్నలు నాలో ఉత్పన్నమయ్యాయి. ఈ సినిమా ప్రభావం నాపై చాలా రోజుల పాటు ఉన్నది. తదుపరి చిత్రం నీతో చేస్తాను అని బాల చెప్పిన ఆ ఒక్క మాట మొత్తం మారిపోయింది. 2000లో నాకు ఆ ఫోన్ కాల్ రాకుంటే నాకు ఈ జీవితమే ఉండేదికాదు. బాల సినిమాల్లో సంబంధం బాంధవ్యాలకు విలువనిస్తారు. బాల అన్న అనేది కేవలం ఒక పదం కాదు. ఇది ఒక సంబంధం. పర్మినెంట్ రిలేషన్. ఈ జీవితాన్ని ఇచ్చినందుకు బాల అన్నకు ప్రేమపూర్వక ధన్యవాదాలు. 'వణంగాన్' కూడా మరో గొప్ప చిత్రంగా నిలుస్తుందని ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు. బాల మాట్లాడుతూ, 'నేను సూర్య సమక్షంలో సిగరెట్ కాల్చను. తమ్ముడు బాధపడతాడు. నా ఆరోగ్యంపై నాకంటే అధిక శ్రద్ధ చూపించే వ్యక్తి' అని అన్నారు. కాగా, అరుణ్ విజయ్ నటించిన 'వణంగాన్' వచ్చే నెల 10వ తేదీ విడుదలకానుంది. బి స్టూడియో సహకారంతో వి హౌస్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మాత సురేష్ కామాక్షి నిర్మించగా, బాల కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. రోషిణి ప్రకాష్ హీరోయిన్. జీవీ ప్రకాష్ కుమార్, శ్యామ్ సీఎస్‌లు సంగీతం సమకూర్చారు.

చిత్రజ్యోతి

రామేశ్వరం నేపథ్యంలో కార్తి చిత్రం

'టానాక్కారన్' ఫేం తమిళ్ దర్శకత్వంలో కార్తి నటించే 'కార్తి-29' మూవీ రామేశ్వరం నేపథ్యంలో తెరకెక్కనుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా నిర్మించనున్నారు. 1960లో రామేశ్వరంలో జరిగే గ్యాంగ్‌స్టర్ కథా నేపథ్యంతో సాగే ఈ మూవీని భారీ బడ్జెట్‌లో రూపొందించనున్నారు. వచ్చే యేడాది మార్చిలో సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. ఈ సినిమా బడ్జెట్ రూ.100 కోట్లు అంటూ కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా కార్తి.. ప్రస్తుతం 'సర్దార్-2', 'వా వాత్తియార్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ఆ తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించే 'ఖైదీ-2'లో నటించనున్నారు. ఇటీవల వచ్చిన 'మెయ్యళగన్' మూవీ ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.



రథోత్సవం



ఆధ్యాత్మికం


విద్యుత్ అలంకరణలో

ప్యారీస్, ఆంధ్రజ్యోతి

భారతదేశంలోని అతిపెద్ద క్యాథలిక్ చర్చిల్లో చెన్నైలోని 'బీసెంట్ నగర్ వేలాంకన్ని మందిరం' ఒకటి. ఎలియట్స్ బీచ్ తీరంలో వెలసిన ఈ మందిరం స్వదేశీ, విదేశీ యాత్రికులకు స్వర్గధామం. ఈ మందిరంలో చిరునవ్వులు చిందించే బాలయేసుతో భక్తులను కరుణించే ఆరోగ్యమాతను భక్తులు పూజిస్తున్నారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు అ చర్చిని సందర్శించి ప్రార్థించడం ఇక్కడి విశేషం. 'క్రిస్మస్' సందర్భంగా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చి విశేషాల సమాహారంపై ప్రత్యేక కథనం...

మహిమాన్వితం

బీసెంట్ నగర్ వేలాంకన్ని ఆలయం

ఆలయ చరిత్ర..

'అన్నై వేలాంకన్ని'గా ప్రసిద్ధి చెందిన ఆరోగ్య మాత కొలువుదీరిన ఈ మందిరాన్ని ప్రతి ఏటా దాదాపు మిలియన్ ప్రజలు సందర్శించుకుంటారని నిర్వాహకులు చెబుతున్నారు. అదే విధంగా ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో పది రోజుల పాటు జరిగే వార్షికోత్సవాల్లో దాదాపు రెండు లక్షల మందికి పైగా హాజరవుతుంటారు. ఆలయ భవనం గోథిక్ నిర్మాణశైలిలో కనువిందు చేస్తుంది. సముద్రతీరంలో ఉండే ఈ ఆలయం ఉప్పు, గాలికి దెబ్బతినకుండా ప్రతి సంవత్సరం మరమ్మతులు చేస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని మదర్ మేరీకి సంబంధించి 'మైలేడీ ఆఫ్ గ్వాదాలుపి (1533), మైలేడీ ఆఫ్ లా సాలెట్టీ (1846), మైలేడీ ఆఫ్ లూర్ద్ (1858), మైలేడీ ఆఫ్ ఫాతిమా (1917), అనే నాలుగు దృశ్యాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించివున్న క్యాథలిక్‌ల ప్రధానకేంద్రం రోమ్ నగరంలోని వాటికన్ చర్చి అంగీకరించింది. 1917 వరకు బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చి అడయార్‌లోని సెయింట్ లూయిస్ చర్చి ఆధీనంలో ఉండేది. 1973వ సంవత్సరం ఈ చర్చిని మద్రాసు ఆర్చిబిషప్ ఆర్.అరులప్ప పరిశుద్ధ స్థలంగా అధికార పూర్వకంగా ప్రకటించారు.

ధ్వజ స్తంభం...

ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీ, సెప్టెంబర్ 8వ తేదీల్లో చర్చి ఉత్సవాలను కోలాహలంగా జరుపుకుంటారు. వార్షికోత్సవాల సందర్భంగా చర్చి ప్రాంగణంలో ధ్వజ స్తంభంపై అమ్మవారి చిత్రపటాలతో రూపొందించిన పతాకాన్ని బీసెంట్ నగర్ పుర వీధుల్లో ఊరేగించి, ఎగురవేసి ప్రారంభించడం ఇక్కడి ఆనవాయితీ. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఆగష్టు 7వ తేదీ రాత్రి నిర్వహించే మేరీమాత రథోత్సవంలో లక్షలాదిగా భక్తులు పాల్గొనడం విశేషం. మరుసటి రోజైన 8వ తేదీ అమ్మవారి పట్టాభిషేకం తర్వాతి రోజు వార్షికోత్సవాలు పూర్తవుతాయి. అదే విధంగా క్రిస్మస్, నూతన సంవత్సరం, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వంటి ప్రధానమైన పండుగ రోజుల్లో జరుపుకునే ప్రత్యేక ప్రార్థనలకు చాలా మతాలకు చెందిన ప్రజలు మతసామరస్యాన్ని చాటుతూ మేరీమాతను సేవిస్తుంటారు.


బీసెంట్ నగర్ వెలాంకన్ని చర్చి

దివ్యక్షేత్రంగా...

నాగపట్నం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని మందిరాన్ని 1962 నవంబర్ 3వ తేదీ రోమ్‌నగరంలో పోప్ జాన్ పౌల్ మైనర్ చర్చిగా ప్రకటించి, వాటికన్ సిటీలో ఉన్న ప్రధాన బాసలికతో అనుసంధానించారు. అదేవిధంగా బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చిని 'దివ్యక్షేత్రం' అని అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి భక్తుల కోర్కెలను తీర్చి అద్భుతాలు చేసే వేలాంకన్ని ఆరోగ్య మాత పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.



ఆలయ ప్రాంగణంలో


మత్స్యకారులకు ఆశ్రయం...

ఆలయ వెనుక భాగంలో ఉన్న జాలరి కుప్పంలో సుమారు 2వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ కుటుంబాల విజ్ఞప్తి మేరకు ఆ స్థలాన్ని చర్చి యాజమాన్యం మత్స్యకారులకు ఉచితంగా కేటాయించి వారి కుటుంబాలకు అండగా నిలిచి వారికి చర్చి తరుపున సహాయాలను అందజేస్తున్నారు.

● భక్తులను కరుణించే ఆరోగ్యమాత


బాలయేసుతో మేరీమాత


నూతన ఆలయం


ప్రార్థనా మందిరం

ఆకట్టుకుంటున్న మ్యూజియం...

చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో వేలాంకన్ని అమ్మవారి అద్భుతాలకు సంబంధించిన వివిధ కథల పుస్తకాలున్నాయి. అనారోగ్యంతో ఉన్నవారు అమ్మవారికి తమ సమస్యలను ప్రార్థన రూపంలో విన్నవించి, కోలుకున్న అనంతరం కృతజ్ఞతలు తెలుపుతూ రాసిన లేఖలు ఈ మ్యూజియంలో వేల సంఖ్యలో ప్రదర్శనకు ఉంచారు. అలాగే మైనం, బంగారు, వెండిలో తయారు చేసిన బొమ్మలు, మొక్కుబడిగా చెల్లించిన శరీర భాగాలు, తదితర కానుకలు భద్రపరచారు. ఈ మ్యూజియంను వారం రోజులు పర్యటకులు సందర్శించి తమ అభిప్రాయాలన్నీ అక్కడున్న పుస్తకంలో రాస్తుంటారు.

ప్రార్థన వేళలు...

ప్రతిరోజూ ఉదయం 6 నుంచి, రాత్రి 9 గంటల వరకు ఈ మందిరంలోని వేలాంకన్ని అమ్మవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, బాలయేసుని ఎత్తుకొన్న దివ్య స్వరూపిణిగా విరాజిల్లుతున్న అమ్మవారికి గులాబీలతో అల్లిన మాలల్ని సమర్పించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు, 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు తమిళంలో ప్రార్థనలు జరుగుతాయి. అలాగే ఉదయం 7.45 గంటల నుంచి 8.45 గంటల వరకు ఆంగ్లంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

సేవా కార్యక్రమాలు...

ఈ చర్చి నిర్వాహకులు 2000వ సంవత్సరం నుంచి సామాజిక సేవా కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల్లో వివాహాది శుభకార్యాలు తక్కువ అద్దె చెల్లించి జరుపునేందుకు పెద్ద కమ్యూనిటీ హాలు, పేద విద్యార్థుల కోసం పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు తరగతి గది, పండుగ రోజుల్లో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా పెద్ద వేదిక కూడా నిర్మించారు. కోరిన కోర్కెలు తీరుస్తున్న వేలాంకన్ని మాతకు కృతజ్ఞతలు తెలుపుతూ భక్తులు కనుకగా సమర్పిస్తున్న చీరలు, వస్త్రాలను మురికివాడల్లో నివసించే పేదలు, ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న భిక్షగాళ్లకు పంపిణీ చేస్తూ మానవతా విలువలను చాటుకుంటున్నారు. అంతేకాకుండా ఉచిత వైద్యశిబిరాలు, అన్నదానం తదితర కార్యక్రమాలు 'బీసెంట్ నగర్ వేలాంకన్ని' ఆలయ నిర్వాహకులు అమ్మవారి పేరుమీద కొనసాగిస్తున్నారు.


నేడు మెరీనాబీచ్‌లో ఫుడ్ ఫెస్టివల్

టి.నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర నగర శివారు ప్రాంతాల జీవనాధార సంస్థ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలలు తయారు చేసే వంటలతో శుక్రవారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించనున్నారు. మెరీనాబీచ్‌లో నిర్వహించనున్న ఈ ఫుడ్‌ఫెస్టివల్ ఈ నెల 24 వరకు కొనసాగనుంది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఫుడ్‌ఫెస్టివల్ ప్రారంభించనున్నారు. కోయంబత్తూరు కొంగు మటన్ బిర్యానీ, కృష్ణగిరి నో ఆయిల్ నోబాయిల్, కరూరు పొరల రొట్టె- మటన్ గ్రేవీ, నామక్కల్ పళ్ళిపాళయం చికెన్, ధర్మపురి రవాఖజూర్, నీలగిరి రాగి సంకటి, తిరుప్పూరు ఎగ్ ఊతప్పం, కాంచీపురం ఆలయ ఇడ్లీ, శివగంగ మటన్ సాల్ట్ కర్రీ, పుదుకోట సుక్కుమల్లి కాఫీ, రాణిపేట ఆర్కాడ్ బిర్యానీ, వేలూరు రాగి కుడుములు, మదురై మటన్ దోసె, విరుదునగర్ గరిటె ఆమ్లెట్, తిరుచ్చి నవధాన్యాల పిట్టు, మైలాడుదురై రొయ్యల వడ, నాగపట్టినం మసాలా గుంట పొంగడాలు, కన్నియాకుమారి పళ్ళ మరమరాలు, చెన్నై కర్డ్ పూరీ ఇలా వందకు పైగా వివిధ జిల్లాల్లో పేరొందిన మాంసాహార, శాఖాహార వంటకాలు ఈ ఫుడ్‌ఫెస్టివల్‌లో చోటుచేసుకోనున్నాయి. ఈ ఆహారపదార్థాలను వేడివేడిగా వడ్డించేందుకు 35 స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆహారభద్రతా శాఖ గుర్తింపు పొందిన 24 బృందాలకు చెందిన మహిళలు ఈ వంటలను శుచిగా వండి వడ్డించనున్నారు. ఈ ఆహార పదార్థాలను విక్రయించడానికి ప్రత్యేకంగా 6 హాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుందని, ఈ నెల 21 నుంచి 14 వరకు రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఫుడ్‌ఫెస్టివల్‌కు వాహనాల్లో వెళ్లేవారి కోసం లేడీ విలింగ్టన్ కళాశాల, మద్రాసు విశ్వవిద్యాలయంలో, రాణిమేరీ కళాశాలలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.




గురువారం చెన్నై తేనాంపేటలో డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో మాజీమంత్రి కె.అన్బళగన్ 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, పార్టీ ప్రముఖులు

దర్శకుడు శంకర్‌దయాళ్ మృతి


డైరెక్టర్ శంకర్‌దయాళ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ దర్శకుడు శంకర్ దయాళ్ (47) గురువారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. హీరో కార్తీ నటించి 2012లో విడుదలైన 'శకుని' చిత్రానికి ఈయన దర్శకత్వం వహించారు. తాజాగా ఆయన 'కేఎంకే - కుళందైగళ్‌మున్నేట్ర కళగం' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రెస్‌మీట్ గురువారం సాయంత్రం నుంగంబాక్కంలో ఏర్పాటైంది. ఆ ప్రెస్‌మీట్‌లో పాల్గొనేందుకు వెళ్ళిన శంకర్‌దయాళ్‌కు ఉన్నట్టుండి గుండె పోటు వచ్చింది. వెంటనే ఆయన్ని చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. శంకర్‌దయాళ్ ఆకస్మికంగా మృతిచెందారని తెలుసుకున్న సినీ రంగ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు.

ఎస్ఆర్ఎం సెంటర్‌లో ఎమర్జెన్సీ డ్రిల్


ఎమర్జెన్సీ డ్రిల్‌లో భాగంగా క్షతగాత్రుడికి అత్యవసర చికిత్సలందిస్తున్న వైద్యనిపుణులు

చెన్నై, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరు శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ భవనాల వద్ద గురువారం ఉదయం అత్యవసర పరిస్థితులలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఎమర్జెన్సీ డ్రిల్ నిర్వహించారు. పోరూరు సిగ్నల్ ప్రాంతం వద్ద భవనం కూలినట్లు, భవన శిథిలాల మధ్య నుంచి క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి, వారికి అత్యవసర చికిత్సలందిస్తున్నట్లు వైద్యనిపుణులు, సిబ్బంది, నర్సులు అత్యవసర చర్యలను చక్కగా ప్రదర్శించారు. ప్రదర్శించారు. ఈ ఎమెర్జెన్సీ డ్రిల్ చూసినవారంతా ఏదో ప్రమాదం జరిగిందనుకుని భీతిల్లారు. గంట తర్వాతే అదంతా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ముందస్తు కవాతు అని తెలుసుకుని ఊరట చెందారు.

రూ.823 కోట్లతో బ్రాడ్వే బస్టాండ్ టెర్మినల్

● దుకాణ దార్లు, నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలం

ప్యారీస్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్రాసు హైకోర్టు సమీపంలోని బ్రాడ్వే బస్టాండును రూ.823 కోట్లతో కొత్త బస్ టెర్మినల్‌గా నిర్మిస్తున్నారు.. ప్రస్తుతం ఈ బస్టాండు ప్రాంతంలో ఉన్న 168 దుకాణాలను నడుపుతున్నవారికి, ఆ ప్రాంతంలో నివసిస్తున్న 45 కుటుంబాలవారిని ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించేందుకు జీసీసీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. నగరం నడి బొడ్డున బ్రాడ్వే బస్టాండు, సమీపంలో ఉన్న కురళగం భవనాన్ని కూల్చివేసి పదంతస్థుల వాణిజ్య సముదాయ భవనం, కొత్త బస్ టెర్మినల్ నిర్మాణానికి రూ.823 కోట్లను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కేటాయించింది. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అక్కడున్న వ్యాపారులు, కుటుంబాలను ఖాళీ చేయాలని నోటీసులు కూడా ఇచ్చారు. త్వరలో వీరందరికీ ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



స్టంట్ మాస్టర్ కోదండరామన్ కన్నుమూత


కోదండరామన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ స్టంట్ మాస్టర్ కోదండ రామన్ (65) అనారోగ్యంతో చెన్నైలో బుధవారం రాత్రి మృతిచెందారు. గత 25 ఏళ్లుగా తమిళ, తెలుగు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా పని చేసిన కోదండరామన్ హాస్య నటుడిగా కూడా రాణించారు. పెరంబూరులో నివసిస్తున్న ఆయన గత కొన్ని నెలలుగా వృద్ధాప్య సమస్యలకు తోడు అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇటీవల ఆరోగ్యం కుదుటపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 10.30 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. 'భగవతి', 'తిరుపతి', 'వేదాళం', సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా పని చేసిన కోదండరామన్ ప్రముఖ దర్శకుడు సుందర్.సి దర్శకత్వం వహించిన 'కలకళప్పు' సినిమాలో హాస్య నటుడిగా నవ్వులు పండించారు. ఆయన మృతి పట్ల సినీ స్టంట్ మాస్టర్ల సంఘ నాయకులు, సినీ కళాకారులు ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు సినీ కళాకారులు స్టంట్ నటుల అశ్రునయనాల మధ్య కోదండరామన్ భౌతికకాయానికి గురువారం సాయంత్రం అంత్యక్రియల జరిగాయి.

కుత్రాలంలో స్నానాలకు అనుమతి



పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుత్రాలం ప్రధాన జలపాతంలో ఏడు రోజులు అనంతరం గురువారం నుంచి పర్యాటకుల స్నానాలకు అనుమతించారు. పశ్చిమ కనుమల్లో కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా కుత్రాలం జలపాతాల వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా వరద ఉధృతి కనిపించింది. దీంతో జలపాతాల వద్ద పర్యాటకు కోసం ఏర్పాటుచేసిన బారికేడ్లు, వాకింగ్ ట్రాక్ తదితరాలు ధ్వంసమయ్యాయి. వరద తగ్గుముఖం పట్టడంతో, జలపాతాల వద్ద బారికేడ్లు, వాకింగ్ ట్రాక్‌లకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో జలపాతాల వద్ద స్నానాలకు అనుమతులు ఇవ్వడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు.

పాంబన్ వంతెనపై ట్రయల్ రన్

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పాంబన్ వంతెనపై రైలింజ్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. పాంబన్ సమీపంలో సముద్రంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో, రూ.550 కోట్లతో కొత్త వంతెన నిర్మించారు. ఈ వంతెన మధ్యలో ఏర్పాటుచేసిన లిఫ్ట్ వంతెన, నౌకలు, పడవలు వెళ్లే సమయంలో పైకి వెళ్లి, మళ్లీ యధాస్థితికి వచ్చేలా ఏర్పాటుచేశారు. వంతెన నిర్మాణపనులు పూర్తయిన నేపథ్యంలో నవంబరు 13,14 తేదీల్లో రైల్వే భద్రతా కమిషనర్ ఏఎం చౌదరి పర్యవేక్షణలో వంతెనపై 90 కి.మీ వేగంతో రైలింజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ సమయంలో, లిఫ్ట్ వంతెనపై వెల్డింగ్ పనులు నాణ్యతగా లేవని, రైల్వే క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్ అనుమతి లేకుండానే వంతెన డిజైన్ చేశారని, బ్రిడ్జి తుప్పుపట్టిన సమయంలో చేపట్టాల్సిన నిర్వహణ చర్యల కోసం ప్రస్తావించలేదని భద్రతా కమిషనర్ తన నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక కారణంగా పాంబన్ వంతెన ప్రారంభోత్సవం వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, 34 రోజుల అనంతరం రైల్వే బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పర్యవేక్షణలో మండపం రైల్వేస్టేషన్ నుంచి రైలింజన్‌తో పాంబన్ కొత్త వంతెన మీదుగా రామేశ్వరం రైల్వేస్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. కాగా, జనవరి మొదటి వారంలో ఈ వంతెన ప్రారంభించే అవకాశాలున్నట్లు రైల్వే అధికారుల సమాచారం.



వండలూరు జూ పార్క్‌లో '3 డీ థియేటర్'

పెరంబూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో రూ.4 కోట్లతో 32 సీట్ల సామర్థ్యంతో కూడిన 3 డీ థియేటర్‌ను అటవీ శాఖ మంత్రి పొన్ముడి బుధవారం ప్రారంభించారు. పార్క్‌కు వచ్చే సందర్శకులు జంతువులను ప్రత్యక్షంగా వీక్షించేలా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని సంబంధించిన సినిమాలు ఈ థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. ఈ థియేటర్‌ను ప్రారంభించిన మంత్రి, మూడు నిమిషాలు 3డీ చిత్రం వీక్షించారు. అనంతరం పార్క్ అవసరాలకు 180 కే.వి.సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి వెంట అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి సెంథిల్ కుమార్, పార్క్ అధికారులున్నారు.



3డీ థియేటర్‌లో చిత్రం తిలకిస్తున్న మంత్రి పొన్ముడి తదితరులు



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్ట్‌మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,457

తలనీలాలు సమర్పించినవారు : 22,152



గంటల్లోపే దర్శనం

చైర్మన్ అనే హోదాను అనుభవించడానికి నేనీ బాధ్యత స్వీకరించలేదు. స్వామి కొలువు గొప్పవరం. తిరుమలకు వచ్చే వెళ్లే ప్రయాణం, బస, భోజనం వంటి ఖర్చులు ఏవీ టీటీడీ మీద భారం మోపడం లేదు. సొంతంగా నేనే పెట్టుకుంటున్నా. దర్శనాల కోసం చైర్మన్ మీద ఎంత ఒత్తిడి ఉంటుందో అందరికీ తెలుసు. అయినా.. దర్శన టికెట్ల కోటాను కూడా నేను వినియోగించుకోవడం లేదు.

టీటీడీకి వచ్చే ఆదాయానికంటే, చేసే ఖర్చే అధికంగా ఉంటోంది. మళ్లీ కుబేరుడివంటి వారిని వెతుక్కుని అప్పు చేయాలి. అలా చేసి పెట్టారు టీటీడీని. వ్యక్తిగత పనులన్నీ వదిలేసి తిరుమలలోనే ఉంటూ అన్నింటిపై దృష్టి సారించా. స్వామికి చెందిన ఒక్క రూపాయి కూడా వృధా కానివ్వను.

తిరుమల ప్రక్షాళన మొదలైంది.

ఆక్రమించిన మఠాల జోలికే వెళ్తాం!

తిరుమలలో 30 దుకాణాలు తిరిగితే కనీసం శ్రీవేంకటేశ్వరస్వామి ఉండే ఉంగరాలు దొరకవు కానీ, శిలువ బొమ్మలుండే కడియాలు ఉంటున్నాయి. దుకాణాల వ్యవహర తీరును కూడా మార్చాలి.

అన్నేసి గంటలు క్యూలో ఉండడం మానవహక్కుల ఉల్లంఘనే

INTERVIEW

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఆయన వెంట మందీ మార్బలం కనిపించదు. ఆర్భాటం అసలు ఉండదు. హడావుడి లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆయన శైలి విలక్షణం. ఒక సాధారణ భక్తుడిలా తిరుమల అంతా కలియతిరుగుతుంటారు. భక్తులతో మాట్లాడుతారు. దుకాణాలను పరిశీలిస్తారు. ఒక రీసెర్చర్‌లా వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత అధికారులతో మాట్లాడుతారు. గుర్తించిన లోపాలు వివరించి సరిదిద్దుకునే అవకాశాలేమిటని ఆరా తీస్తారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చే దిశగా తిరుమల ప్రక్షాళనకు పూనుకున్నారు టీటీడీ కొత్త చైర్మన్ బీఆర్ నాయుడు. పెనుమూరు మండలం దిగువపునేపల్లిలో పుట్టి పెరిగిన ఈయన తొలుత బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత వ్యాపార వేత్తగా స్థిరపడ్డారు. .... న టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు గత చైర్మన్‌లకు భిన్నంగా తన ఖర్చులన్నీ తనే పెట్టుకుంటూ తిరుమలలో ఉంటున్నారు. తిరుమలలో భక్తుల కష్టసుఖాలు తెలుసుకుంటూ, టీటీడీ అనుపానులు గ్రహిస్తూ ఆచితూచి అడుగేస్తున్న బీఆర్ నాయుడుతో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

? చైర్మన్ కావాలని ఎప్పుడు అనిపించింది. ఎందుకు.

! దాదాపు పదిహేనేళ్ల కిందటే టీటీడీ ధర్మకర్తల మండలికి చైర్మన్ కావాలని కోరుకున్నా. చిత్తూరు జిల్లాలో పుట్టిపెరిగిన వాడిగా ఇక్కడుండే సమస్యలన్నీ నాకు తెలుసు. నేను చైర్మన్ అయితే మార్పులు చేయగలనని చిన్న ఆశ. స్వామి ఇచ్చిన ఈ అవకాశాన్ని గొప్పవరంగా భావిస్తున్నా. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ తిరుమలకు వస్తూనే ఉన్నాను. శ్రీవేంకటేశ్వర స్వామి మీద అచంచల భక్తి చిన్నప్పటి నుంచే ఉంది.

? గతంలో దర్శనానికి ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా.

! 10 గంటలకు పైనే క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయి. ఒక్కోసారి క్యూలైన్‌లో వేళ్లే సమయం లేక పుష్కరిణిలో కాళ్లు కడుక్కొని, తలపై చల్లుకుని, కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయేవాడిని. గొల్లమండం నుంచే స్వామికి నమస్కరించుకుని ఈసారికి ఇదే భాగ్యం అనుకునేవాడిని. గతంలో గవర్నమెంట్ సర్వీస్‌లో ఉండేవాడిని. సెలవులు తక్కువ. టైం ఉండదు కాబట్టి అన్నేసి గంటలు క్యూలో ఉండే వీలుండేది కాదు.

? చైర్మన్‌గా తిరుమలలో మీరు గుర్తించిన లోపాలేంటి.

! ప్రధానంగా స్వామి దర్శనానికి వచ్చే వారిని 20 నుంచి 30 గంటల పాటు కంపార్టుమెంట్లలో కూర్చోబెట్టి తాళాలు వేసేస్తున్నారు. లోపలికి రానివ్వరు, బయటకు పోనివ్వరు. నా దృష్టిలో అది కరెక్ట్ కాదు. మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని గతంలో కూడా చెప్పాను. భక్తులు చాలా ఇబ్బందులు పడటాన్ని స్వయంగా చూశా. ఐదు కిలోమీటర్ల పొడవుతో ఉన్న క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిలుచుంటున్నారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అంతదూరం నడిపించాల్సిన అవసరం ఏమిటో? అలాగే వ్యర్థాల తొలగింపు సరిగా జరగడం లేదు. కుప్పలుకుప్పలుగా చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగింపునకు ఒక సంస్థకు రూ.20 కోట్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు. వారి నిర్వహణ సరిగా లేదు. డబ్బులు ఇచ్చిమరీ చెత్తను తీసుకెళ్లేవారు ఉంటే, వాళ్లను వదిలేసి మనమే డబ్బు ఇచ్చి చెత్త తీసుకువెళ్లండి అనడం ఏమిటో! ఆసంస్థను మార్చాలనుకుంటున్నాం. ఇక, స్విమ్స్ ఆస్పత్రికి ఏడాదికి రూ.వంద కోట్లు టీటీడీ ఇస్తోంది. ఈ అంశంపై తగిన సూచనల కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశాం. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేదనుకుంటే, కమీషన్ల కోసం కక్కుర్తిపడి గతంలో పిల్లల ఆస్పత్రి, క్యాన్సర్, హార్ట్ ఆస్పత్రి అని పెట్టారు. ఇవన్నీ అవసరమా?. రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,200 కోట్లు పెట్టి భవనాలు కడుతున్నారు. కట్టి ఏం చేస్తారు. టీటీడీ పని అదేనా? ఆలయాలు లేని చోట కట్టించాలి. నైవేద్యం లేని చోట ఏర్పాట్లు చేయాలి. భజనలు, హిందు ధర్మప్రచార కార్యక్రమాలు చేయాలి. దాని కోసం కదా టీటీడీ ఖర్చు చేయాల్సింది.

? ఆభరణాలు, బంగారు నిల్వలు భద్రంగానే ఉన్నాయా.

! అన్ని సేఫ్‌గానే ఉన్నాయి. ఎలాంటి సందేహాలు అవసరం లేదు.

? ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఎందుకు.

! ఉద్యోగుల్లో కొంతమంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొందరైతే బూతులు మాట్లాడుతున్నారు. వాదవివాదాల్లో భక్తులపైకి కొట్టేందుకు కూడా కొందరు వెళ్లిపోతున్నారు. అటువంటి వాళ్లను భక్తులు ఎలా గుర్తుపట్టాలి?. అందుకే నేమ్ బ్యాడ్జీ ఉంటే భక్తులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఉంటుంది. ఆ తర్వాత విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. దీనిపై బోర్డులో చర్చించి త్వరలోనే అమలుచేస్తాం.

? ఎలాంటి మార్పులు చేయాలనుకుంటున్నారు.

! ఎయిర్‌పోర్టులో డిజి యాత్ర విధానాన్ని అందరూ చూసే ఉంటారు కదా. అదే తరహాలో ఏఐ సహకారంతో తిరుమల శ్రీవారి దర్శనాన్ని కూడా గంట వ్యవధిలోనే చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భక్తుడు తిరుపతికి రాగానే ఆధార్‌కార్డును లింక్ చేసి ఫేస్‌రికగ్నిషన్‌తో టోకెన్ జారీ చేస్తాం. అందులో టైం వచ్చేస్తుంది. ఆ సమయానికి క్యూకాంప్లెక్స్ వద్దకు వస్తే నేరుగా లోపలికి వెళ్లిపోవచ్చు. వేరేవేరు ప్రాంతాల్లో కావాల్సినన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తే తోపులాటలు కూడా ఉండవు. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన ఐదారు సంస్థలు ఈ వ్యవస్థ ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి.. ఉచితంగా చేస్తామంటున్నారు. త్వరలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తాం. సత్ఫలితాలు వస్తే రెండు మూడు నెలల్లోనే అమలుచేస్తాం. ఏఐ అందుబాటులోకి వస్తే వసతికి ఇబ్బందులు కూడా ఉండవు.

? టీటీడీ డిపాజిట మళ్లింపు ప్రక్రియ ఏదశలో ఉంది.

! దాదాపు రూ. 4,800 కోట్లు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్నాయి. ప్రస్తుతం వాటి జోలికి వెళ్లం. కాలపరిమితి పూర్తవగానే భద్రత కోసం జాతీయ బ్యాంకులకు మళ్లిస్తాం. ఇక కొత్త డిపాజిట్‌లు అన్నీ మాత్రం జాతీయ బ్యాంకుల్లోనే వేస్తాం.

? టీటీడీలో అన్యమత ఉద్యోగుల తొలగింపు సాధ్యమేనా.

! వంద శాతం సాధ్యమే. మనం వాళ్ల పొట్టపై కొట్టడం లేదు. ప్రత్యామ్నాయాలు ఉన్నాయి కదా. ముందు మంచి బెనిఫిట్స్‌తో వీఆర్‌ఎస్ ఇస్తాం. లేకుంటే ప్రభుత్వానికి డిప్యూటేషన్‌పై సరెండర్ చేస్తాం. వాళ్లు కూడా వద్దంటే వేరే ఆలయాలు ఉన్నాయి కదా. జమ్ము, ముంబై, కన్యాకుమారి వంటి వాటికి మారుస్తాం. పేరేమో వెంకటేశ్వరరావు అని ఉంటుంది. కానీ తిరుపతిలో చర్చిలు నిర్వహిస్తూ ఉంటారు. ఇంట్లోనే చర్చి ఉంటుంది. ఏం చేయాలి వాళ్లని? భక్తన్నా ఉండాలి.. లేదా భయమైనా ఉండాలి. వాళ్లకి ఆ రెండూ లేవు.

? తిరుమలలో మఠాల నిర్వహణపై మీ స్టాండ్ ఏమిటి.

! అదో తేనె పుట్ట. ఎన్నో ఏళ్ల నుంచా ఉన్న వాళ్లను ఎలా ఇబ్బంది పెడతాం. మఠాధిపతులు, పీఠాధిపతులు అందరు ఉన్నారు ఇక్కడ. కొన్ని మఠాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయనే విమర్శలు వస్తునే ఉన్నాయి. టీటీడీ కేటాయించిన స్థలాల్లో కాకుండా అదనపు స్థలాలను ఆక్రమించుకుంటే మాత్రం.. వాటిపై చర్యలు తీసుకుంటున్నాం.

? టీటీడీలో ప్రక్షాళన చేస్తామని సీఎం అన్నారు. ఆదిశగా ఏం చేస్తున్నారు

! గతంలో జరిగిన కొన్ని అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్‌తో విచారణ చేయిస్తోంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై కూడా సిట్ వేగంగా దర్యాప్తు చేస్తోంది. దానిపై ఇప్పట్లో ఏం మాట్లాలేం. రిపోర్టులు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకుంటాం. గతంలో సివిల్ వర్క్స్ విపరీతం చేశారు. స్వామి డబ్బులంతా సివిల్ వర్క్స్ కోసం వెళ్లిపోతున్నాయి. ముందు ఆపనుల్ని ఆపేయాలి. ఉన్న భవనాలను కూల్చేసి కొత్తవి కట్టడం అవసరమా? టీటీడీకి వచ్చే ఆదాయంలో ఒక శాతం తిరుపతి మున్సిపాలటీకి ఇవ్వాలంట. ఎందుకు ఇవ్వాలి? ఇవన్నీ రానున్న బోర్డులో చర్చిస్తాం. దేవుడు సొమ్ము ఇలా దుర్వినియోగం అయితే ఎలా? వందల మైళ్ల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని వందో రెండొందలో హుండీలో వేస్తారు భక్తులు. కమీషన్ల కోసం వారి భక్తిని ఇలా దుబారా చేస్తే ఎలా. అందుకే తిరుమల నుంచి ప్రక్షాళన చేస్తామని సీఎంగారు చెప్పారు.

? టూరిజం టికెట్ల కోటా రద్దు వెనుక కారణం.

! రూ.300 టూరిజం టికెట్‌ను అధిక ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నేనే స్వయంగా రూ.3,300 పెట్టి కొనుగోలు చేశాను. విజిలెన్స్ వాళ్లకు చెప్పాను. వాళ్లు కూడా రూ.300 టికెట్‌ను రూ.3,300 కొన్నారు. దీంతో టూరిజం కోటానే రద్దు చేశాం. తిరుమలలోని కొన్ని దుకాణాల్లోనూ దర్శన టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్టు తెలిసింది. దానిపై కూడా నిఘా పెట్టాం.



కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. నాటి సరదాలే కాదు.. చిన్న వయసులోనే పెళ్లయిన అమాయకత్వాన్ని, ఏమీ తెలియనితనం నుంచి భర్త చంద్రబాబు దన్నుతో హెరిటేజ్ సారథిగా సాధించిన విజయాలను తలపోశారు. అన్న బాలకృష్ణ డైలాగ్‌ను వల్లించారు. కుమారుడు లోకేశ్ బాల్యాన్ని, పెద్దయ్యాక ఆయనకు చేసిన ఉద్బోధను ఏకరువు పెట్టారు. మొత్తంమీద నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లా కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మమేకమై వారిలో ఒకరిగా మారిపోయారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

సరదా సరదాగా..!

విద్యార్థులతో మమేకమైన నారా భువనేశ్వరి

- మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు.
- నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు.
- నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజలకోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని.
- నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా.
- నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్డ్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో.
- నేను హైలెవల్ పర్ఫెక్షనిస్ట్‌గా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడం లేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా.
- నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో.
- నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20-30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్స్‌లు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో.ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా.
- నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మా యానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటి నుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.





ఈరోడ్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఘనస్వాగతం పలుకుతున్న స్థానికులు

డీజిల్ ఇంజన్‌తో ఊటీ రైలు ట్రయల్ రన్

టి.నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నీలగిరి కొండరైలులో ప్రయాణించడానికి దేశవిదేశాల పర్యాటకులు ఆసక్తికనబరుస్తుంటారు. ఆ రైలులో ప్రయాణిస్తూ కున్నూరు - నుండి మేట్టుపాళయం దాకా ఇరువైపులా పచ్చదనంతో కూడిన పర్వతాల అందాలను, ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదించడం అందరికీ వింత అనుభూతిని కలిగిస్తుంది. ఆ కొండ రైలింజన్‌ను ఇప్పటివరకూ ఫర్నేస్ ఆయిల్ ద్వారా నడుపుతున్నారు. ఆ రైలింజన్ నుండి వెలువడే కారుమబ్బుల్లాంటి దట్టమైన పొగల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని భావించిన రైల్వే అధికారులు డీజిల్ ఇంజన్ మార్చారు. గత యేడాది కున్నూరు నుండి తిరుచ్చి పొన్‌మలై యార్డుకు మరమ్మతు కోసం తీసుకెళ్లి పెట్టా క్వీన్ అనే ఈ ఇంజన్‌ను డీజిల్ ఇంజన్‌గా మార్చి, కొత్తగా పెయింటింగ్ చేసి మేట్టుపాళయానికి బుధవారం తీసుకువచ్చారు. ఆ తర్వాత మేట్టుపాళయం నుండి కున్నూరు దాకా ఆ రైలింజన్‌ను ఇంజనీరింగ్ నిపుణులు పర్యవేక్షణలో నడిపారు. ఆ తర్వాత ఇంజన్ సామర్థ్యాన్ని కూడా తనిఖీ చేసి ఇంజనీర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో డీజిల్ ఇంజన్‌తో కూడిన కొండ రైలు సర్వీసును ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.



'మిమ్మల్సి వెతుకుతూ మీ ఊరిలో' కార్యక్రమం

వేలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కనియంబాడి పంచాయతి యూనియన్ నలమనత్త గ్రామంలో గురువారం జరిగిన 'మిమ్మల్ని వెతుకుతూ మీ ఊరిలో' కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేయనున్న ఫైరింగ్ శిక్షణా కేంద్రం స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వల్లమ్ గ్రామం సమీపం బెంగళూరు-విల్లుపురం జాతీయ రహదారిపై రూ.63.61 కోట్లతో చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే, కార్పొరేషన్ 3వ వార్డు పరిధిలోని కనికాపురం కార్పొరేషన్ పాఠశాల తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం నాణ్యత పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యన్, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, పలు శాఖల అధికారులున్నారు.